క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి



ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : డ్రైవింగ్‌లో ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని ఐకేపీ ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ అన్నారు. గ్రామైక్య సంఘ సభ్యులు, ఎస్.రాయవరం పోలీసులు కలిసి రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా కోఆర్డినేటర్ మాట్లాడుతూ గ్రామాల్లో ద్విచక్ర వాహనాలు నడిపే వారు విధిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీట్ బెల్టు పెట్టుకుని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

కోటవురట్ల: వరుణుడి రాకతో మండలంలో ఆహ్లాద వాతావరణం నెలకొంది. శనివారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారి కుండపోత వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత పది రోజులుగా సూరీడు రెచ్చిపోవడంతో తీవ్ర వడగాడ్పులు వీచాయి. ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. ప్రస్తుత వర్షానికి వాతావరణం పూర్తి చల్లబడడంతో జనం సేద తీరుతున్నారు. అయితే ఈదురు గాలుల కారణంగా మామిడి రైతుకు నష్టం వాటిల్లిందని పలువురు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఏఎస్ఐ రామకృష్ణ కోరారు. మండలంలోని గంటవానిపాలెం గ్రామంలోని దళితవాడలో శనివారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల,మతాలకు అతీతంగా అంతా సోదరభావంతో మెలగాలన్నారు. వివాదాలకు తావు లేకుండా స్థానికంగా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సర్పంచ్ వెంకటలక్ష్మి, ఈవోఆర్డీ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రమణ, వైఎస్సార్‌సీపీ నేత అరిగా శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రీ సర్వే పారదర్శకంగా జరగాలి



పల్లపు ఆనందపురం సచివాలయంలో రీ-సర్వే డేటా పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

మునగపాక : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ-సర్వే పారదర్శకంగా జరిగేలా చూడాలని అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సూచించారు. మండలంలోని రెండో విడత రీ-సర్వేకు సంబంధించిన గ్రామాలైన తోటాడ, పల్లపు ఆనందపురంలోని సచివాలయాలను ఆమె శనివారం సందర్శించారు. రీ-సర్వేకు సంబంధించిన డేటా వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సర్వే సమయంలో సరిహద్దు వివాదాలకు అవకాశం లేకుండా చూడాలని చెప్పారు. ఆమె వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మునగపాక : ఇటీవల నాగులాపల్లికి చెందిన విద్యార్థుల మృతికి సంబంధించి ఆయా కుటుంబ సభ్యులను శనివారం మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పరామర్శించారు. నాగులాపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థులు భాను ప్రకాష్, సంపత్‌లు శారదానదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి చనిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఆయా కుటుంబ సభ్యులను కొణతాల పరామర్శించి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి

అనకాపల్లి టౌన్: అనకాపల్లి డీఎస్పీగా వి.సుబ్బారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విజయవాడ బెంజ్ సర్కిల్‌లో 1995లో ఆయన ఎస్ఐగా పోలీస్ శాఖలో చేరారు. విజయవాడ, ఏలూరు డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించి పదోన్నతులు పొందారు. సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ టీంతోపాటు విజయవాడ సర్కిల్ పరిధిలో ఏసీబీ డీఎస్పీగా విధులు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి డీఎస్పీగా నియమితులయ్యారు.

జగనన్న పాలనకు ఇంటింటా జనామోదం

- నియోజకవర్గంలో సంతృప్తికరంగా 'మా నమ్మకం నువ్వే జగన్'
- 70 వేలకు పైగా మిస్డ్ కాల్స్ రూపంలో జగన్ పాలనకు సమ్మతి
- 68 సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి
- జూన్ 15 తర్వాత నుంచి సచివాలయాల సందర్శన
- విలేకరులతో యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): యలమంచిలి నియోజకవర్గంలో 88 వేల ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ద్వారా వెళ్లగా, 70వేల మంది మిస్డ్ కాల్స్ రూపంలో తమ సమ్మతిని తెలియపరిచారని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. అచ్యుతాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభించిందన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, మండల పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఐదు ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళి ద్వారా సంక్షేమ పథకాల గురించి ఆరా తీశామన్నారు. ఒకటి రెండూ శాతం అసంతృప్తి వ్యక్తం చేసినా మిగిలిన వారంతా జగన్ పాలన పట్ల సంతోషంగా ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 68 సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేశామని తెలిపారు. జూన్ 15 తర్వాత సచివాలయాను సందర్శించి ఇంకా ఏవైనా సమస్యలు, సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను సేకరించి శత శాతం సంతృప్తి వచ్చేలా కృషి చేస్తామన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ప్రజల నాడిని తెలుసుకునేందుకు దోహదపడుతోందన్నారు. మిస్డ్ కాల్స్, స్టిక్కర్లు స్వచ్ఛంద ఆమోదంతో అంటించుకోవడం వంటి పరిణామాల ద్వారా జగన్ పాలనపై ప్రజల్లో ఎంతో విశ్వాసం ఉందని ప్రస్ఫుటం అవుతోందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ కోన బుజ్జి, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద పాల్గొన్నారు.

సంక్షేమ రాజ్యం జగన్‌తోనే సాధ్యం



చినరామభద్రపురంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



ప్రచారం సాగిస్తున్న జెడ్పీటీసీ సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు

'మా నమ్మకం నువ్వే జగన్'కు విశేష స్పందన

నక్కపల్లి : నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందిన పథకాలు, వారి స్పందన తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. దాదాపు 22 రోజుల పాటు ఎంతో ప్రతిష్టాత్మకంగా హుషారుగా జరిగిన ఈ కార్యక్రమం శనివారంతో ముగిసింది. శనివారం చినరామభద్రపురం, వేంపాడు, నెల్లిపూడి, రాజయ్యపేట, గునిపూడి గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం జగన్ పాలనలో ప్రతి పథకం తమ చెంతకే వస్తోందని, పింఛన్లు కూడా ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారని, దళారుల ప్రమేయం, కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ప్రభుత్వ సాయం నేరుగా తమ ఖాతాల్లోనే జమ అవుతోందంటూ లబ్ధిదారులు ఆనందంతో చెప్పారు. కార్యక్రమంలో ఒడ్డిమెట్ట దేవస్థానం మాజీ చైర్మన్ దండు బలరామరాజు, సచివాలయ కన్వీనరు రమణ, సాదు భారతి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : ప్రభుత్వం నుంచి జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు సక్రమంగా అందాయా అమ్మా..అంటూ ఎస్.రాయవరం కన్వీనర్ పవన్ పలువురు లబ్ధిదారులను పలకరించారు. ఎస్.రాయవరం శివారు అగ్రహారంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. పలు ఇళ్లను సందర్శించి పథకాలపై జనాభిప్రాయం తెలుసుకున్నారు. మారు మూల ఉన్న వారిని సహితం గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని, మేమంతా ఆ బాబుని మరచిపోలేమని పలువురు లబ్ధిదారులు సమాధానం ఇచ్చారు.

పాయకరావుపేట : మా నమ్మకం, మా భవిష్యత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నే అని ముక్త కంఠంతో పలువురు ప్రజలు, సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో శనివారం పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. రానున్న రోజుల్లో కూడా జగన్ మోహన్‌రెడ్డికే పూర్తిగా మద్దతు తెలిపి, సంక్షేమ పథకాలు కొనసాగే విధంగా అందరం కృషి చేయాలని ప్రజలను, లబ్ధిదారులను కోరారు.

ఇంటింటా సంక్షేమ లబ్ధి



కాకరాపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పాటిపల్లి ఎంపీటీసీ, సచివాలయ కన్వీనర్ శిరీషా అన్నారు. .మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కాకరాపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి తేడా గుర్తించి వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్లను గోడలపై అంటించి 8296082960 ఫోన్ నెంబర్‌కు మిస్డ్‌కాల్స్ ఇప్పించారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం ద్వారా మరిన్ని పథకాలు అర్హులకు అందుతాయని పేర్కొన్నారు. సర్పంచ్ కొల్లి ముసిలినాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఇల్లా నాగేశ్వరరావు, కర్రి నాగిరెడ్డి, కొల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సురేష్ ప్రమాణ స్వీకారోత్సవం



మాట్లాడుతున్న మండల యూత్ అధ్యక్షుడు శేఖర్

పరవాడ: వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన అధ్యక్షుడిగా నియమితులైన సబ్బవరం మండలం ఆరిపాకకు చెందిన పాలిశెట్టి సురేష్ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం సాయంత్రం 4 గంటలకు సబ్బవరం దరి జోడుగుళ్ల కూడలిలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు మండల పార్టీ యూత్ అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్ చెప్పారు. శనివారం పరవాడ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. భారీ బహిరంగ సభకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, రాష్ట్ర మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పెందుర్తి శాసన సభ్యుడు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొంటున్నారని చెప్పారు. బహిరంగ సభకు మండలంలో నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు.

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి

మునగపాక : విద్యార్థులు సన్మార్గంలో నడవడం ద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ఎస్ఐ మహమ్మద్ ఆలీ అన్నారు. టి.సిరసపల్లి ప్రాథమిక పాఠశాల వీడ్కోలు సభకు అతిథిగా హాజరైన ఆలీ మాట్లాడు వేసవి సెలవుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు పుస్తక పఠనంపై దృష్టి సారించాలన్నారు. ఖాళీ సమయంలో ఆటలు, అభిరుచులకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ వీరునాయుడు, పీఎంసీ చైర్మన్ జగ్గప్పారావు, హెచ్‌ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

అధ్వానంగా హౌసింగ్ అధికారుల తీరు

మండల సమావేశంలో ధ్వజమెత్తిన సభ్యులు



అధికారులను నిలదీస్తున్న వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు

నక్కపల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి, ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల సాకారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తూంటే గ్రామాల్లో గృహనిర్మాణ శాఖ అధికారులు కొంతమంది బ్రోకర్లతో కుమ్మక్కయి లబ్ధిదారుల నుంచి లంచాలు గుంజుతున్నారని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. శనివారం నక్కపల్లి ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖపై జరిగిన చర్చలో ఏఈ రాజు మాట్లాడుతుండగా వైస్ ఎంపీపీ వీసం నానాజీ, న్యాయంపూడి ఎంపీటీసీ ఆకేటి గోవిందరావు, వేంపాడు ఎంపీటీసీ కుంచా మధు తదితరులు మాట్లాడుతూ గృహనిర్మాణ శాఖ పనితీరు చాలా అధ్వానంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటికి బిల్లు చెల్లించాలంటే దళారులకు, ఇంజినీరింగ్ సిబ్బందికి వేలాది రూపాయలు లంచాలు ఇచ్చుకోవాల్సి వస్తోందన్నారు. దీనిపై స్పందనలో ఫిర్యాదులు సయితం వస్తున్నాయన్నారు. ఒక గ్రామం నుంచి ఒక బాధితుడు సొంత స్థలంలో నిర్మిస్తున్న తన ఇంటికి బిల్లు చెల్లించాలంటే ఏఈ రూ.30 వేలు అడుగుతున్నారని ఒక దళారీ తనను డిమాండ్ చేస్తున్నారంటూ ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేసారన్నారు. దీనికి కక్ష కట్టిన సిబ్బంది అతని ఇంటి నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉందని బిల్లు చెల్లించడానికి అవకాశం లేదని ఫిర్యాదు దారుడికి వలంటీరు ద్వారా నోటీసు ఇచ్చారన్నారు. లబ్ధిదారులకు అందాల్సిన ఇసుక, సిమెంట్ ఐరన్‌ను కొన్ని గ్రామాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, బ్రోకర్లు కుమ్మక్కయి పక్కదారి పట్టించారన్నారు. అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది అవినీతి వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. దీంతో స్పందించిన ఏఈ రాజు గృహ నిర్మాణాలకు లబ్ధిదారులు ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు. లబ్ధిదారుల నుంచి ఎవరైనా డబ్బు లు వసూలు చేసినా, ఇవ్వాలని ఒత్తిడి చేసినా తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై క్రిమినల్ కేసు లు పెడతామన్నారు. జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, ఎంపీడీవో సీతారామరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉజ్వల భవిష్యత్



గొల్లపేట ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా అభివృద్ధి చేసిందని హెచ్‌ఎం జీవన్ అన్నారు. స్థానిక గొల్లపేటలోని ఎంపీపీ స్కూల్‌లో శనివారం పాఠశాల పేరెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు జగనన్న విద్యా కానుక కిట్లతో విద్యార్థులకు కావలసిన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నారన్నారు. పైసా ఖర్చు లేకుండా మంచి విద్యతో ఉజ్వల భవిష్యత్‌ను అందిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. వేసవి సెలవుల్లో పుస్తక పఠనం చేయాలని సూచిస్తూ గ్రంథాలయ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయుడు కచ్చళ్ల రామిరెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దిబ్బపాలెంలో గడప గడపకు



దిబ్బపాలెంలో లబ్ధిదారులకు నవరత్నాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని ఎస్ఈజెడ్ కాలనీ, మోటూరుపాలెం, కొల్లివానిపాలెం, గురజాపాలెం, నక్కపాలెం గ్రామాల్లో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, నవరత్నాల గురించి వివరించారు. ఎనిమిదేళ్లకే చక్కెర వ్యాధితో బాధపడుతున్న చిన్నారి కుటుంబానికి ధైర్యం చెప్పి వైద్య పరీక్షలకు వెళ్లినప్పుడు తనకు తెలపమని ఎమ్మెల్యే స్వయంగా తన నంబర్ ఇచ్చారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాము, కోఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, అడిగర్ల రాము పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



రాజుపేట జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులవాణి

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని డీఎల్‌డీవో మంజులవాణి కోరారు. హౌసింగ్ డే లో భాగంగా శనివారం ఆమె మండలంలోని రాజుపేట, నాగవరం లే-అవుట్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ అర్హులైన ప్రతి నిరుపేదకు జగనన్న కాలనీలో పట్టాలు అందజేస్తున్నామన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందజేస్తుందన్నారు. దీనికి తోడు ప్రతి జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పేదోడి సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో పి.రవికుమార్, వెలుగు ఏపీఎం కొండమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



సూర్యచరణ్, అశోక్

పాయకరావుపేట: జేఈఈ మెయిన్స్‌లో శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆల్ ఇండియా లెవెల్‌లో ఎస్సీ కేటగిరిలో ఎన్.సూర్య చరణ్ 61వ ర్యాంకు, జనరల్ విభాగంలో ఎస్.అశోక్ నందు 5961వ ర్యాంకు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.ఎస్.భానుమూర్తి తెలిపారు. తమ కళాశాలలో కోచింగ్ తీసుకొని ఈ సంవత్సరం 17 మందికి పైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కి అర్హత సాధించారని పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

పాయకరావుపేట : పట్టణంలోని గల మెయిన్‌రోడ్డులో పాత గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు చలివేంద్రం ఏర్పాటు చేసి, ప్రారంభించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పాదచారులు, వాహనాదారుల దాహర్తిని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు గ్రామ పంచాయితీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ తెలిపారు. చలివేంద్రం ప్రారంభించి, మజ్జిగను సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గారా ప్రసాద్, జగతా శ్రీనివాస్, కార్యదర్శి జె.చంద్రశేఖర్, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గోకివాడలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఏయూ ప్రొఫెసర్ రాజేశ్వరి

రాంబిల్లి : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఏయూ న్యూట్రిషన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి అన్నారు. శనివారం గోకివాడ, పంచదార్ల గ్రామాల్లో పౌష్టికాహారం-ప్రాధాన్యత-ఆవశ్యకత అంశాలపై అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ, చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను తినాలన్నారు. ఆకు కూరలు తినడం ఆరోగ్యానికి మంచిదన్నారు. విజయవాహిని స్వచ్ఛంద సంస్థ, టాటా ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.సూర్యనారాయణ, టాటా ట్రస్టు ప్రాజెక్టు మేనేజర్ సాయిచరణ్, ఎంపీటీసీ ధూళి అమ్మాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ద్వారపురెడ్డి గోవింద, పోషణ సఖిలు, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం



అన్నవరంలో పౌరహక్కులను వివరిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల : ప్రతి పౌరుడుకి భారత రాజ్యాంగం కొన్ని హక్కులను కల్పించిందని, వాటిని పొందేందుకు అవగాహన తప్పనిసరని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. అన్నవరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ హక్కులకు భంగం కలిగినపుడు కచ్చితంగా ప్రశ్నించాలన్నారు. పౌర హక్కులతో స్వేచ్ఛగా జీవించే అవకాశం ఉందన్నారు. తహసీల్దారు జానకమ్మ, ఈవోపీఆర్డీ ప్రేమ్ సాగర్, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం



కె.వెంకటాపురంలో కొత్తగా అమరుస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

కోటవురట్ల: కె.వెంకటాపురంలో 9వ వార్డులో శనివారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్లుగా గ్రామంలో పలు విద్యుత్ సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇటీవల తెగి పడిన విద్యుత్ తీగలను తాకడం వల్ల ఓ వ్యక్తి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ విద్యుత్ శాఖాధికారులతో చర్చలు జరిపి విద్యుత్ సమస్యల పరిష్కారానికి హామీ తీసుకున్నారు. దాంతో నాలుగు రోజులుగా గ్రామంలో పాడైన విద్యుత్ తీగలను మార్చడంతో పాటు లోఓల్టేజీ సమస్య ఉన్న వార్డుల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అమరుస్తున్నారు.

సొంతింటి కలను నెరవేర్చుకోండి..



గొట్టివాడలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. గొట్టివాడలో వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్‌లో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. లే అవుట్‌లో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకునేందుకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. మెటీరియల్ అందుబాటులో ఉందని, బిల్లులు కూడా సకాలంలో మంజూరవుతున్నట్టు తెలిపారు. హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఈవోపీఆర్డీ ప్రేమ్‌సాగర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూలజంపలో ఉచిత వైద్యశిబిరం

రాంబిల్లి: మూలజంప గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ వేగి జోగినాయుడు వర్ధంతి సందర్భంగా హిందూ మిత్ర ఫౌండేషన్ సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు అందజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేగి అచ్చియ్యనాయుడు, గణేష్, జగన్నాధరావు పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు 193 మంది హాజరు

పాయకరావుపేట : పట్టణంలో గల కనోస్సా స్కూల్లో శనివారం జరిగిన నవోదయ పరీక్షకు 193 మంది విద్యార్థులు హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి కె.ఎన్.గాంధీ తెలిపారు. 208 మంది విద్యార్థులకు గాను 193 మంది పరీక్షలకు హాజరయ్యారని, 15 మంది హాజరుకాలేదని ఎంఈవో తెలిపారు.